1. దుష్కర్ములకు నప్పగించెనా – యూద – యిస్కరి యోతనెడి శిష్యుడు = తస్కరించినవాని భంగిన నిన్ను – నిష్కారణముగాను బట్టిరా ॥ఆహా॥
2. కలుషాత్ములందరు గూడిరా – నిన్ను – బలువిధంబుల హింసబెట్టిరా = తలపై ముళ్ల కిరీటముంచి యా – సిలువ నీతోనే మోయించిరా ॥ఆహా॥
3. కాలుసేతులయందు వారలు – ఇనుప – చీలల దిగగొట్టిరయ్యయ్యో = జాలి – సుమంతైన జూపక – వారు – గేలిజేయుచు బాధపెట్టిరా ॥ఆహా॥
4. బాధ తగ్గింపరాణువవారలు – నీకు చేదు ద్రాక్షారసము నివ్వగా = నీదు మనస్సు దానినొల్లక గొప్ప – వేదనలను భరియించెనే ॥ఆహా॥

– కొత్తపల్లి జాన్

## 191 సిలువ ధ్యానము

రా – శోకవవళి తా – ఆది

ఎంతో వింత యెంతో చింత – యేసునాధు మరణ మంత = పంతము తోc జేసి రంత – సొంత ప్రజలు స్వామి నంత ॥ఎంతో॥

1. పట్టి కట్టి నెట్టి కొట్టి – తిట్టి రేసు నాధు నకటా = అట్టి శ్రమల నొంది పలుకc – డాయె యేసు స్వామి నాcడు ॥ఎంతో॥
2. మొయ్యలేని మ్రాను నొకటి – మోపి రేసు వీపుపైని = మొయ్యలేక మ్రానితోడ – మూర్ఛcబోయె నేసు తండ్రి ॥యెంతో॥
3. కొయ్యపై నేసయ్యన్ బెట్టి – కాలుసేతులలోc జీలల్ = కఠిను లంత గూడి కొట్టిరి – ఘోరముగc క్రీస్తేసున్ బట్టి ॥యెంతో॥
4. దాహముగొనc జేదు చిరకc – ద్రావ నిడిరి ద్రోహు లకటా = ధాత్రిc ప్రజల బాధ కోర్చి – ధన్యుcడా దివి కేగె నహహా ॥యెంతో॥
5. బల్లెముతోc బ్రక్కన్ బొడవన్ – పారె నీరు రక్త మహహా = ఏరై పారె యేసు రక్త – మెల్ల ప్రజల కెలమి నొసcగు ॥నెంతో॥



## 192 క్రీస్తు మరణ శ్రమల ధ్యానము

రా – ముఖారి (చాయ: ఎంతో దుఃఖము) తా – అట

ఐదు గాయము లొందినావా – నాకొరః! కైదు – గాయము లొంది నావా = ఐదు గాయముల నా – యాత్మc దలంప నా కారాట మెచ్చినదే – నీ – మైదీగె నావంటి – మర్త్యుల పాల్జేసి – మరణ మొందితివి గదే ॥ఐదు॥

1. గార మైన నీ శ – రీర రక్త మిలను – ధారయై కారినదా – నా = నేరమా యయ్యది – భారమై నీ పైని – ఘోరమై యొరిగినదా ॥ఐదు॥
2. అందమౌ నీ తనువు – కంది రక్త స్వేద – బిందువులై రాలెనే – యీ = చంద మూహింప నా – డెందమ్ము భీతిచేc – గొందలమై తూలెనే ॥ఐదు॥
3. ఎల్ల పాపము మోయు – అల్ల దేవుని గొఱ్ఱె – పిల్లవు నీవేగదా – నా = వల్లనా నీ కింత – యల్లాట పుట్టెనే – చెల్ల తాళునె నా యెద ॥ఐదు॥
4. భంగమౌనట్టి దు – ష్పాపులc గావ నీ – ప్రాణ మర్పించితివా – యీ = సంగతిc జూడ నీ – సాహస మింక నే – భంగి నీ జగతి మరవ ॥నైదు॥
5. ఆయాసమైన నీ – యాపదలెల్ల నే – నాలోచింపcగ నాత్మలో – నెడ = బాయక తద్దివ్య – పాదసరోజముల్ – భాసిల్లు నా యాత్మలో ॥నైదు॥
6. తల్లికైన మరి – తండ్రి కైన నన్న – దమ్ముల కైన లేదే – కన్న = పిల్లలకైన నీ – ప్రేమc పోల్చుద – మన్నc – బృథివిలోc గానరాదే ॥ఐదు॥
7. ఈ ప్రీతి నీ యోర్మి – నీ మహాత్మ్యం బిల – నెవ్వ రూహింతు రొగి – నో = హో ప్రభువా తద్ద – యొత్కట గాంభీర్య – మూహింప నీకే తగు ॥నైదు॥

– బేతాళ్ జాన్

## 193 సిలువమీcది క్రీస్తు

రా – హిందుస్థాని కాపి తా – త్రిపుట

చూడరే సిలువను ప్రే – లాడు యేసయ్యను = పాడు లోకంబునకై – గోడు జెందెc గదా ॥చూడరే॥